క్లుప్తంగా

నెట్టికంటుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే



ప్రసాదాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండ టౌన్ : కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామిని గురువారం పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి దర్శించుకున్నారు. శ్రావణ మాసం చివరిరోజు సందర్భంగా స్వామి వారికి ఆకుపూజ చేయించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే వెంట మద్దికెర, పత్తికొండ వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

అభివృద్ధి పురోగతిపై సమీక్ష



సమావేశంలో పాల్గొన్న మండల అధికారులు

మద్దికెర: మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై మండల అధికారులతో గురువారం ఎంపీడీఓ నరసింహమూర్తి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న నీతి అయోగ్ కార్యక్రమం కింద మద్దికెర మండలం ఎంపికై ఒదన్నారు. ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ వాటికి కావలసిన మౌలిక సదుపాయాలు గురించి చర్చించారు. ప్రభుత్వ వైద్యశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించామని గర్భిణులు ప్రతినెలా పరీక్షలు, కాన్పులు వంటి సేవలు పొందాలని సూచించారు. పొదుపు మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రణాళికలు రూపొందించడం, గ్రామాభివృద్ధికి తీసుకోవాల్సిన విధివిధానాల గురించి చర్చించారు. ఈఓఆర్డీ మద్దిలేటి స్వామి, ఏఓ రవి, ఉపాధి ఏపీఓ నర్సిరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌభాగ్యలక్ష్మి, ప్రభుత్వ వైద్యాధికారి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోండి



బెరడుతో చేసిన ప్లేట్లను పరిశీలిస్తున్న అధికారులు

మద్దికెర: రాష్ట్ర ప్రభుత్వం అందించే సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి పొందాలని జిల్లా మహిళా సాధికార సంస్థ కో–ఆర్డినేటర్ షణ్ముఖ, ఐకేపీ ఏపీఎం మధుబాబు అన్నారు. గురువారం మద్దికెరలో ఒక్క బెరడుతో తయారు చేసిన ప్లేట్లను, యంత్రాలను ఆయన పరిశీలించారు. సోలార్ డ్రై మిషన్ల గురించి లబ్ధిదారులతో మాట్లాడారు. యూనిట్లను విజయవంతంగా నిర్వహించి అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం ఐకేపీ కార్యాలయంలో పొదుపు మహిళలకు పారిశుద్ధ్యం, నీరు, పోషణ గురించి అవగాహన కల్పించారు.

గ్రంథాలయ పితామహుడికి నివాళి

ఆలూరు: గ్రంథాలయ పితామహుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు భావితరాలకు ఆదర్శనీయుడని గ్రంథాలయ శాఖ మాజీ చైర్మన్ రామ్మూర్తినాయుడు అన్నారు. స్థానిక లైబ్రరీలో గురువారం గాడిచర్ల హరిసర్వోత్తమ రావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి లైబ్రేరియన్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రిటైర్డు ఉపాధ్యాయుడు రవి ప్రకాష్, పుస్తక నిక్షిప్తం కేంద్ర నిర్వాహకులు అరికెర రాజమ్మ తదితరులు తదితరులు పాల్గొన్నారు.

ఖురాన్ పోటీలో ప్రతిభ

ఎమ్మిగనూరుటౌన్: పలమనేరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఖురాన్ కంఠస్థం, ప్రశ్నోత్తరాల పరీక్షా పోటీల్లో పట్టణంలోని మదరసా ఇస్లామియా సుల్తానుల్ ఉలూమ్ ట్రస్ట్‌లో హఫీజ్ విద్య చదువుతున్న ఆదోనికి చెందిన మహమ్మద్ ఇస్మాయిల్ సుల్తానీ ప్రథమ స్థానంలో నిలిచినట్లు ట్రస్ట్ నిర్వాహకులు అబ్దుల్ లతీఫ్ గురువారం తెలిపారు. తమ ట్రస్ట్‌లో చదువుతున్న ఆ విద్యార్థి పలమనేరులో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతి పొందినట్లు వెల్లడించారు.

బింగిదొడ్డిలో పట్టపగలు చోరీ

వెల్దుర్తి: మండల పరిధిలోని బింగిదొడ్డి గ్రామంలో పట్టపగలు చోరీ జరిగింది. బాధితుడు జంగం మనోహర్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు.. రోజులాగే పిల్లలు స్కూల్‌గా వెళ్లగా మనోహర్ కుటుంబసభ్యులతో కలిసి పొలానికి వెళుతూ పిల్లలు త్వరగా ఇంటికి వస్తారన్న ఉద్దేశంతో ఇంటి ముందు రహస్య స్థలంలో తాళం చెవి ఉంచి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి తిరిగివచ్చి చూడగా తలుపులు తెరచి బీరువా పగులగొట్టబడి ఉంది. బీరువాలోని 3 తులాల బంగారు నగలు, రూ.50 వేలు నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఘటనపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

నిరుపేదలకు అండగా ప్రభుత్వం



మాట్లాడుతున్న మంత్రి గుమ్మనూరు జయరాం



మంత్రికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

హొళగుంద: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తూ వివక్ష లేని పాలనతో నిరుపేద కుటుంబాలకు అండగా ఉన్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. గురువారం మంత్రి తన సోదరులు శ్రీనివాసులు, నారాయణస్వామితో కలిసి పెద్దగోనెహాళ్, ఎం.డీ హళ్లిలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా, పెద్దగోనెహాళ్ సర్పంచ్ కొత్తింటి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. మంత్రికి రెండు గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పెద్దగోనెహాళ్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించగా ఎండీ హళ్లిలో సీఎం వైఎస్ జగన్ ఫ్లెక్సీని ఏర్పాటు చేసి పూలవర్షం కురిపించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

పెద్దగోనెహాళ్‌లో మంత్రి పర్యాటిస్తుండగా ఎస్సీ, బీసీ కాలనీ ప్రజలు డ్రైనేజీలు, సీసీ రోడ్ల సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. మంత్రి స్పందిస్తూ సచివాలయాలకు మంజూరు చేసిన రూ.20 లక్షలతో పాటు మండల గ్రాంటు నిధులతో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే మద్దిలింగదహళ్లి గ్రామంలో సీసీ రోడ్డు, కల్వర్టు నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో పెద్దగోనెహాళ్, ఎం.డీ.హళ్లి గ్రామాలకు సంక్షేమ పథకాల ద్వారా నాలుగేళ్లలో రూ.9.76 కోట్లు అందించినట్లు చెప్పారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రజా సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్ జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.



ఎండీ హళ్లిలో సీఎం వైఎస్ జగన్ ఫ్లెక్సీపై పూలవర్షం కురిపిస్తున్న దృశ్యం

రెండెకరాల చంద్రబాబుకు రెండు లక్షల కోట్ల ఆస్తి ఎలా?

ఎండీ హళ్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడు రెండెకరాల నుంచి రూ.2 లక్షల కోట్లకు ఎలా అధిపతి అయ్యాడని ప్రశ్నించారు. ఆయన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో 14 ఏళ్ల సీఎం హోదాలో ఎన్నో స్కాంలు చేసి ప్రజాధనాన్ని దోచుకున్నారని ఆరోపించారు. తాజాగా రూ.371 కోట్లు కొల్లగొట్టి పాపం పండడంతో జైలుపాలయ్యాడన్నారు. తమ నేత కడిగిన ముత్యంలా బయటికొస్తాడని చెబుతున్న వారు చంద్రబాబు ఇన్ని కోట్లు ఎలా సంపాదించారో చెప్పాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా, నాయకులు ఈశా, కుమారస్వామి, వెంకటరెడ్డి, ప్రహ్లాదరెడ్డి, అయ్యాళప్ప, రాంభీంనాయుడు, మల్లికార్జున, మరిస్వామి, పాండు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

తుగ్గలి: అర్హత ఉండి రైతు భరోసా పథకం ద్వారా సాయం అందని రైతులు ఉంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ శాఖ మండల అధికారి పవన్‌కుమార్ గురువారం తెలిపారు. అలాగే కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా జిరాక్సు కాపీలు తీసుకెళ్లి ఆయా రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ సిబ్బంది సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

16న వేలం పాట

గోనెగండ్ల: మండల కేంద్రంలో వెలసిన చింతలాముని, నల్లారెడ్డి స్వాముల దశమి సందర్భంగా టెంకాయల విక్రయ హక్కుల వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ పూజారులు తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. అక్టోబర్ 4, 5, 6 తేదీలలో స్వాములవారి ఉరుసు మహోత్సవం సందర్భంగా టెంకాయల విక్రయాలకు వేలం పాట నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 16న ఉదయం 10 గంటలకు స్వామి దేవాలయం ప్రాంగణంలో వేలం పాట ఉంటుందని వెల్లడించారు. ఆసక్తి కలిగిన వారు రూ.వెయ్యి డిపాజిట్ చేసి వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

ఉత్సాహంగా క్రీడాపోటీలు

ఆలూరు రూరల్: క్రీడలు మానసికోల్లాసాన్ని ఇస్తాయని ఆలూరు ఎంఈఓ–2 చిరంజీవి రెడ్డి అన్నారు. స్కూల్ గేమ్స్ ఆఫ్ అథ్లెటిక్స్‌లో భాగంగా గురువారం స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాల–2లో అండర్–14, అండర్–17 క్రీడల పోటీలు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ,, విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు అవసరం అన్నారు. స్కూల్ గేమ్స్ ఇన్‌చార్జ్ కవిరాజు ఫిజికల్ డైరెక్టర్లు నాగేషులు, సరోజ పీఈటీలు చిన్న బాబు, ఈరన్న,హుసేన్, ప్రతాప్, శివ తదితరులు ఉన్నారు.

నేడు, రేపు నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు

స్థానిక ప్రభుత్వ బాలుర–2 పాఠశాలలో శుక్రవారం బాలికలకు, శనివారం బాలురకు నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ పీడీ కవిరాజు తెలిపారు. ఆయా మండల స్థాయిలో జరిగిన పోటీల్లో ఎంపికైన క్రీడాకారులకు నియోజకవర్గ స్థాయిలో పోటీలు నిర్వహిస్తామన్నారు. క్రీడల్లో పాల్గొనే వారికి అన్నిసౌకర్యాలు కల్పించామన్నారు.

తుగ్గలి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని హెచ్‌ఎం నరేంద్ర, పీఎంసీ చైర్మన్ నాగరాజు అన్నారు. పెండేకల్లు రైల్వే జంక్షన్ జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో గురువారం మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలను వారు ప్రారంభించారు. అండర్–14, 17 విభాగాల్లో బాల, బాలికలకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, టెన్ని కాయిట్, బాల్‌బాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని వారు వెల్లడించారు.



మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓ చిరంజీవి రెడ్డి

వెల్దుర్తి: మండల పరిధిలోని గోవర్ధనగిరి జెడ్పీ హైస్కూల్ మైదానంలో గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల ఇన్‌చార్జ్ పీడీ నిర్మలాదేవి ఆధ్వర్యంలో మండలస్థాయి స్కూల్ గేమ్స్, పాఠశాల పీడీ నరసింహులు నిర్వహణలో ప్రారంభమయ్యాయి. పోటీలను ఎంఈఓ–2 రమేష్, హెచ్‌ఎం జమ్ములన్న, పేరెంట్స్ కమిటీ చైర్మన్ మహేశ్ ప్రారంభించారు. బాలుర అండర్–17, అండర్–14 విభాగాలలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, బ్యాడ్మింటన్, షటిల్, యోగా, టెన్నికాయిట్స్, అథ్లెటిక్స్ క్రీడాంశాలలో మండలంలోని 12 హైస్కూళ్ల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. రెండు విభాగాలలో 150కు మించి క్రీడాకారులు వివిధ క్రీడాంశాలలో ప్రతిభ చూపి నియోజకవర్గ స్థాయికి ఎన్నికైనట్లు ఇన్‌చార్జ్ తెలిపారు.

నాడు - నేడు పనులు పూర్తి చేయాలి

ఎమ్మిగనూరురూరల్: నాడు – నేడు కింద చేపట్టిన ప్రభుత్వ పాఠశాలల భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తయ్యేల చూడాలని ఏంఈఓ ఆంజనేయులు ఆదేశించారు. ఆయన గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో హెచ్‌ఎంలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల గదుల నిర్మాణానికి కావలసిన నిధులు ఉన్నాయని, ప్రధానోపాధ్యాయులు వాటిని సక్రమంగా వినియోగించాలన్నారు. సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పనులు పూర్తయితే విద్యార్థులకు అన్ని వసతులు అందుబాటులోకి వస్తాయన్నారు. ఎంఈవో–2 మధుసూదన్‌రాజు, ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు సచివాలయ భవనం ప్రారంభోత్సవం

వెల్దుర్తి: స్థానిక సంతమార్కెట్ సమీపంలో నిర్మించిన సచివాలయం–1 నూతన భవనాన్ని శుక్రవారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు బొమ్మన రవిరెడ్డి, వెంకట్‌నాయుడు, పీఆర్ ఏఈ సురేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సద్వినియోగం చేసుకోండి

కృష్ణగిరి: ప్రభుత్వం కల్పిస్తున్న వైద్య సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ రవి మోహన్ కోరారు. మండల పరిధిలోని బోయబొంతిరాళ్ల గ్రామంలో గురువారం సేవాభారతి, ఐఎంఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2025 నాటికి రాష్ట్రంలో క్షయ వ్యాధి లేకుండా చేయాలనే లక్ష్యంతో గ్రామాలకు వచ్చి నిర్ధారణ పరీక్షలు చేయడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో పొగాకు, సిగరెట్ తదితర అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. క్షయవ్యాధి నిర్ధారణ అయిన వారికి 6 నెలలు ఉచితంగా మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. వైద్యులు శ్రీనివాసులు, సూపర్‌వైజర్లు వెంకటేశ్వర్లు, ఆరోగ్య, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగులో రాణించాలి

దేవనకొండ: రైతులు పండ్ల తోటల సాగులో రాణించాలని హార్టికల్చర్ ఆఫీసర్ దస్తగిరి సూచించారు. ఈ మేరకు గురువారం స్థానిక సీఎల్‌ఆర్‌సీ భవనంలో ఎంజీఎన్‌ఆర్ ఈజీఎస్ పథకం కింద హార్టికల్చర్ పరిధిలోని పంటలైన మామిడి, కొబ్బరి, జామ, దానిమ్మ, చీని, డ్రాగన్‌ఫ్రూట్, సీతాఫలం, నేరేడు పంటల సాగు, సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. పథకం ద్వారా రైతులకు ఎప్పటికప్పుడు పండ్ల మొక్కలను అందిస్తామన్నారు. ఈ రంగంలో రాణించే వారికి మంచి ఆదాయం వస్తుందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గురుకులం క్రీడాకారుల ప్రతిభ

వెల్దుర్తి: అథ్లెటిక్ అసోషియేషన్ ఆధ్వర్యంలో కర్నూలు స్టేడియంలో బుధవారం జరిగిన జిల్లా స్థాయి పరుగు పందెం పోటీలలో స్థానిక జ్యోతి బాపూలే బీసీ బాలికల సంక్షేమ గురుకుల పాఠశాల క్రీడాకారిణులు ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్స్‌పాల్ షబానా బేగం తెలిపారు. అండర్–16 100 మీటర్ల రేస్‌లో రాజేశ్వరి, 2 కి.మీల రేస్‌లో భార్గవి ద్వితీయ స్థానం, అండర్–14 60 మీటర్ల రేస్‌లో అర్చన తృతీయ స్థానం పొందినట్లు తెలిపారు. శుక్రవారం గురుకులంలో జరిగిన కార్యక్రమంలో క్రీడాకారిణులను, తర్ఫీదునిచ్చిన పీఈటీ షబానాను ప్రిన్సిపాల్ అభినందించారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ఎమ్మిగనూరు 18వ వార్డులో వృద్ధురాలికి సంక్షేమ క్యాలెండర్ అందిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని 18వ వార్డు పరిధిలో వార్డు ఇన్‌చార్జ్ సోమేష్, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, అధికారులు, పార్టీ నాయకులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డు పరిధిలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్లు ఇచ్చి పింఛన్లు, సంక్షేమ పథకాల లబ్ధి తదితర అంశాలను అడిగి తెలుసుకొన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ లబ్ధి చేకూర్చుతున్న సీఎంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో అండగా నిలవాలని కోరారు. వార్డు పరిధిలో సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణం తదితర సమస్యలపై ఆ ప్రాంత వాసులు ఆయన దృష్టికి తీసుకురాగా సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి రియాజ్‌అహమ్మద్, మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ అబ్రార్, నాయకులు షబ్బీర్, సునీల్‌కుమార్, కోటకొండ నరసింహులు, బంగిశ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

నందవరం: నదికై రవాడి గ్రామంలో గురువారం 'గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 210 ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం నుంచి అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. నాలుగేళ్ల పాలనలో తమ ప్రభుత్వం చేసిన సేవలు, సంక్షేమ పథకాలను వివరించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో దళారుల ప్రమేయం లేకుండా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు నేరుగా చెంతకు చేరుతున్నాయన్నారు. గ్రామంలో కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. నందవరం మండలంలో నూతన పింఛన్లు 192 మందికి మంజూరైనట్లు చెప్పారు. మండల కన్వీనర్ శివారెడ్డి గౌడ్, సర్పంచ్‌లు విరుపాక్షిరెడ్డి, ఈశ్వరమ్మ, ఎంపీడీఓ దశరథ రామయ్య, ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య, వైకేపీ ఏపీఎం చిన్నవీరన్న, విద్యుత్‌శాఖ ఏఈ రవీంద్ర, ఆర్‌ఐ జెర్మియా తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యంను చూపుతున్న పోలీసు సిబ్బంది

నందవరం: కర్ణాటక మద్యం అక్రమంగా తరలిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తిమ్మయ్య పేర్కొన్నారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. మండల పరిధిలో కనకవీడు గ్రామంలో ఉదయం డీఎస్పీ సీతారామయ్య, సీఐ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఆ సమయంలో ఇద్దరు వ్యక్తులు గ్రామ శివారు కే.పేట రోడ్డులో అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా ఎస్‌ఐ తిమ్మయ్య నేతృత్వంలో పోలీసులు దాడులు చేపట్టారు. తెలంగాణ రాష్ట్రం, జోగుళాంబ గద్వాల జిల్లా, కేశవరం గ్రామానికి చెందిన చాకలి తిమ్మప్ప, బోయ నరసింహులును అరెస్ట్ చేసి వారి నుంచి కర్ణాటక మద్యం జాన్స్ ఒరిజినల్ ఛాయస్ విస్కీ 960 (90 ఎంఎల్) టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు కనకవీడుకు చెందిన బోయ గోవిందుకు మద్యం బాక్సులు ఇచ్చేందుకు తీసుకెళ్తున్నట్లు తెలిసింది. అతన్ని కూడా అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు. దాడుల్లో ఏఎస్‌ఐ ఆనంద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సారా విక్రేతల అరెస్ట్

వెల్దుర్తి: కోడుమూరు సెబ్, స్థానిక పోలీసు బృందం సంయుక్తంగా గురువారం ఎల్ నగరం గ్రామంలో జరిపిన సోదాలలో అయ్యన్న, మద్దమ్మ వద్ద నుంచి 25 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి డోన్ ఎక్సైజ్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచామన్నారు.

ఈ-కేవైసీ చేయించుకోవాలి

హాలహర్వి: పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు ఈ–కేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి శివశంకర్ సూచించారు. ఈ మేరకు గురువారం ఆయన సిద్ధాపురం, గూళ్యం గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను పరిశీలించారు. అనంతరం రైతులు సాగుచేసిన పత్తి, వరి తదితర పంటలను పరిశీలించారు. మండలంలో దాదాపుగా 306 మంది కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు ఇవ్వడం జరిగిందని, వీరందరికీ పంట రుణాలు మంజూరుచేయాలని స్థానిక బ్యాంకు మేనేజర్‌కు విన్నవించినట్లు చెప్పారు.

ఈ–క్రాప్ గడువు పొడిగింపు

మద్దికెర: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలకు సంబంధించి ఈ–క్రాప్ నమోదుకు ఈనెల 30వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ఏఓ రవి గురువారం తెలిపారు. సంబంధిత రైతులు తమ పొలాలకు సంబంధించి పట్టాదారు పాస్‌బుక్‌లు, ఆధార్‌కార్డు తీసుకెళ్లి పొలాల్లో జియోట్యాగింగ్ చేయించాలన్నారు. అలాగే సమీప రైతు భరోసా కేంద్రాలలో ఈ–కేవైసీ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు.

పైర్ల పరిశీలన

హొళగుంద: ఆయా గ్రామాలలో వీఏఏలు ఈ–క్రాప్ నమోదు చేసిన పైర్లను గురువారం ఏఓ ఆనంద్ లోకదళ్ పరిశీలించారు. హెబ్బటం, పెద్దగోనెహాళ్, ఇంగళదహాల్ ఆర్బీకేల పరిధిలో పంటలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాగు చేసిన ప్రతి పంటను రైతులు తప్పని సరిగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ–క్రాప్, ఈకేవైసీ కోసం రైతులు ఆర్బీకేల పరిధిలోని వీఏఏలను సంప్రదించాలన్నారు.

మహిళల రక్షణకు 'దిశ'



పోలీస్‌స్టేషన్‌లో మహిళా డెస్క్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ

ఎమ్మిగనూరురూరల్: మహిళలు, యువతులు, విద్యార్థినుల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం దిశ చట్టాన్ని తీసుకువచ్చిందని ఎస్పీ జి. కృష్ణకాంత్ పేర్కొన్నారు. స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన మహిళా డెస్క్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. మహిళలు ఎక్కడైనా ఇబ్బందుల్లో ఉంటే వెంటనే దిశయాప్ బటన్ నొక్కితే చాలని నిమిషాల వ్యవధిలో పోలీసులు అక్కడికి చేరుకుంటారని చెప్పారు. మహిళల ఫిర్యాదు కోసం పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేకంగా డెస్క్‌ను ఏర్పాటు చేయటం చాలా సంతోషంగా ఉందన్నారు. పోలీసులు విధులను సమర్థవంతంగా నిర్వహించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం రూరల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కను నాటి నీళ్లుపోశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు డీఎస్పీ బి. సీతారామయ్య, ఎమ్మిగనూరు రూరల్, టౌన్, మంత్రాలయం, కోసిగి సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు మోహన్‌రెడ్డి, మధుసూదన్‌రావు, శ్రీనివాసులు, ఎరిషావలి, ఎస్‌ఐలు నిరంజన్‌రెడ్డి, తిమ్మయ్య, తిమ్మారెడ్డి, ఏఎస్‌ఐలు, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో నాలుగు రోజుల పాటు వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఇందుకు పోలీసుల సంపూర్ణ సహకారం ఉంటుందని జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్, ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్ కుమార్ సూచించారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 'వినాయక ఉత్సవాల నిర్వహణ'పై పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ స్థానిక గణేష్ ఉత్సవ కేంద్ర కమిటీ సభ్యులు పట్టణంలో ఏర్పాటు చేసుకోనే వినాయక ప్రతిమల జాబితాను ఇస్తే ఆ మేరకు అన్ని శాఖల వారు తగిన ఏర్పాట్లు చేస్తారన్నారు. శాంతియుత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహించుకోవాలని ఇతరులకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. నిమజ్జనం రోజున చిన్న పిల్లలను దూరంగా ఉంచి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మతసామరస్యం పాటిస్తూ పండుగను జరుపుకోవాలన్నారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డి, డీఎస్పీ సీతారామయ్య, తహసీల్దార్ ఆంజినేయులు, ఎల్లెల్సీ డీఈ లక్ష్మణ్‌కుమార్ మాట్లాడారు. నిమజ్జనం రోజున ఇబ్బందులు లేకుండా రోడ్ల మరమ్మతులు, విద్యుత్, ఎల్లెల్సీలో నీటి నిల్వ, క్రేన్‌లు, విద్యుత్ లైట్లు, బారికేడ్ల ఏర్పాట్లు, ఊరేగింపులో చెట్ల కొమ్మలు తగలకుండా తొలగించే ప్రక్రియ చేపట్టాలని వినాయక కేంద్ర కమిటీ సభ్యులు రామకృష్ణ, జైన్ తదితరులు కోరారు. ముస్లిం మతపెద్దలు సీఫతులా, యుసుఫ్‌మౌలానా, అతావుల్లా, జిల్లా వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షుడు రియాజ్ అహమ్మద్, అధికారులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

నందవరం: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుధావతి, ఏఎన్‌ఎం సుధారాణి సూచించారు. గురువారం మండల పరిధిలోని టి.సోమలగూడూరు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం–3లో పోషణ మహోత్సవాలు నిర్వహించారు. అలాగే గర్భిణులు, బాలింతలు, తల్లులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు వేదవతి, సుజాత, రాణి, పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వలంటీర్లు, సచివాలయ ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు పక్కాగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. గురువారం సాయంత్రం స్థానిక ఉప్పర ఫంక్షన్ హాల్‌లో వలంటీర్లు, సచివాలయ వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శుక్రవారం నుంచి వలంటీర్లు వారి క్లస్టర్ల పరిధిలో ఇంటింటికీ వెళ్లి వ్యాధులపై సమగ్రంగా సర్వే చేయాలన్నారు. బీపీ, షుగర్, డెంగీ తదితర వాటిపై ఆరా తీయాల్సి ఉంటుందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష యాప్‌ను డౌన్‌లోడ్ చేయించాలని కోరారు. 16వ తేదీ నుంచి వైద్యాధికారుల నేతృత్వంలో 7 రకాల టెస్ట్‌లు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, సచివాలయ అడ్మిన్లు వలంటీర్ల ద్వారా చేయించి వాటి వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. ఆ మేరకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద మెడికల్ క్యాంప్‌లు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తారన్నారు. మెడికల్ క్యాంప్‌ల వివరాలు వ్యాధిగ్రస్తులకు తెలియజేయాలని సూచించారు. మున్సిపల్ మేనేజర్ వరప్రసాద్, ఆర్‌ఓ బేబి, అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్యులు వీణ, సాయిజాహ్నవి, శారద, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వెల్దుర్తిలో హెల్త్ క్యాంప్‌ల షెడ్యూల్

వెల్దుర్తి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలో ఈనెల 30 నుంచి నిర్వహించే వైద్య శిబిరాల షెడ్యూల్‌ను ఎంపీడీఓ శ్రీనివాస రావ్ గురువారం ప్రకటించారు. తాను డీటీ ప్రసాద్ రాజు, ఆర్‌ఐ మస్తాన్ ఒక టీమ్‌గా, తహసీల్దార్ శివ రాముడు, ఈఓఆర్డీ నరసింహులు, ఎంఈఓ–2 రమేశ్ మరో టీమ్‌గా ఆయా పీహెచ్‌సీల డాక్టర్లు, స్పెషలిస్ట్ డాక్టర్ల పర్యవేక్షణలో క్యాంప్‌లు ఉంటాయని పేర్కొన్నారు. ప్రారంభ రోజు వెల్దుర్తి–1, అక్టోబర్ 3న గోవర్ధనగిరి–1, 4న గోవర్ధనగిరి–2, 5న మల్లెపల్లె, 6న బింగిదొడ్డి, 7న రామళ్లకోట, 9న మదార్‌పురం(సూదేపల్లె), 10న శ్రీరంగాపురం, 11న పుల్లగుమ్మి, 12న చెరుకులపాడు, 16న వెల్దుర్తి–3, 17న రత్నపల్లె, 18న కలుగొట్ల, 19న బొమ్మిరెడ్డిపల్లె, 20న లక్ష్మి నగరం, 21న నర్సాపురం, 25న వెల్దుర్తి–2, 28న కలుగొట్ల–2 పరిధిలో హెల్త్ క్యాంపులు ఉంటాయన్నారు.

ఆలూరు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఆలూరు ఎంపీడీఓ అల్లబకాష్ సూచించారు. ఆయన గురువారం స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. మండలంలోని 17 సచివాలయాల పరిధిలో కార్యక్రమం విజయవంతం చేయడంపై పలు సూచనలు చేశారు. మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ మారుతి ఎంఈఓ చిరంజీవి రెడ్డి, ఈఓ కృష్ణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



కనకవీడులో గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ సీతారామయ్య

నందవరం: ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ సీతారామయ్య హెచ్చరించారు. గురువారం మండల పరిధిలోని కనకవీడు గ్రామంలో సీఐ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనంతరం డీఎస్పీ గ్రామస్తులతో మాట్లాడుతూ.. గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పేకాట, గుట్కా, మట్కా, అక్రమ మద్యం వంటి చర్యలకు పాల్పడితే జైలుకు తరలిస్తామన్నారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని ఇరు వర్గాలతో మాట్లాడి పరిష్కరిస్తామని తెలిపారు. పిల్లలను బాగా చదివించాలని సూచించారు. అక్రమ మద్యం రవాణాకు పాల్పడితే కఠిన చర్యలుంటాయన్నారు. ఎస్‌ఐలు తిమ్మయ్య, తిమ్మారెడ్డి, ఏఎస్‌ఐలు ఆనంద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నూతన పింఛన్ల పంపిణీ



నిట్రవట్టిలో నూతన పింఛన్లను పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ లింగప్ప, నాయకులు

హాలహర్వి: మండలకేంద్రంలో– 23, నిట్రవట్టి గ్రామంలో–19 మందికి కొత్తగా పింఛన్లు మంజూరైనట్లు జెడ్పీటీసీ సభ్యుడు లింగప్ప తెలిపారు. వృద్ధులకు, వితంతువులు, వికలాంగులకు ప్రతినెలా 1వ తేదీ నుంచి 10వ తేదీలోపు పింఛన్లు అందించేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అందించే పింఛన్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీలకు, కులమతాలకు అతీతంగా అన్నివర్గాల వారికి పింఛన్లను అందిస్తున్న ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ మాత్రమేనని చెప్పారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చౌదరి, ఎంపీటీసీ గోపాల్, సర్పంచ్ గాదిలింగప్ప, వీఆర్వో ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమావాస్య పూజలు

ఆస్పరి: మండల పరిధిలోని ఆస్పరి మారెమ్మవ్వ, రామతీర్థంలోని రామలింగేశ్వర స్వామి, గాయత్రీ మాత, తంగరడోణలో చింతలముని స్వామి, నల్లారెడ్డి స్వామి, కైరుప్పలలో వీరభద్ర స్వామి ఆలయాలలో గురువారం అమావాస్య పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలలో గంగ పూజ, అభిషేకం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.